క్లుప్తంగా

పైడితల్లి ఆలయ సెక్యూరిటీ సిబ్బందిపై వేటు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి దేవస్థానంలో రాత్రి సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్న ఇద్దరిని విధుల నుంచి తొలగించినట్లు ఆలయ ఇన్చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఆలయ పరిసర ప్రాంతంలో గత పదేళ్లుగా ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఇద్దరు వ్యక్తులు మద్యం తాగినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఆలయ ప్రతిష్ఠకు ఎటువంటి భంగం వాటిల్లరాదని, అలా చేసినవారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు



గుర్లలో మొక్కజొన్న పంట

గుర్ల: మండలంలోని పెద్దబంటుపల్లి, జమ్ము, గుర్ల, నడుపూరు, ఆనందపురం, గూడెం, కోటగండ్రేడులో మొక్కజొన్న పంట ఆశాజనంగా ఉందని ఏఓ తిరుపతిరావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో సుమారు మూడు వేల ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారని చెప్పారు. పొటాష్, నానో డీఏపీ వినియోగంతో అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. మొక్కజొన్న పంట వేసిన రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.

పెదమానాపురంలో వైద్యశిబిరం



సిబ్బందికి సూచనలు చేస్తున్న వైద్యాధికారి ఆనంద్‌కుమార్

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం వెల్‌నెస్ సెంటర్ వద్ద శుక్రవారం నిర్వహించిన వైద్యశిబిరంలో 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనంద్‌కుమార్ తెలిపారు. బీపీ, సుగర్, నీరసం, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులతో పాటు సాధారణ రోగులను పరీక్షించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



నాగేశ్వరరావు

వేపాడ: వల్లంపూడి పోలీస్‌స్టేషన్ ఏఎస్సైగా నాగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నాగేశ్వరరావు ఏడు నెలలుగా ఇదే స్టేషన్‌లో హెచ్‌సీగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడే ఏఎస్సైగా నియమితులయ్యారు. ఈమేరకు పలువురు ఆయన్ను అభినందించారు.

వీధిలైట్ల ఏర్పాటు



వీధి లైట్లు వేస్తున్న దృశ్యం

గుర్ల: గుర్ల మండలంలోని చింతపల్లిపేటలో విద్యుత్ స్తంభాలకు శుక్రవారం లైట్లు అమర్చారు. రాత్రి వేళ ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి, లైట్లు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ జమ్ము శ్రీదేవి తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు జమ్ము అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి పనులను పర్యవేక్షించారు.

4 కేంద్రాల్లో నవోదయ ప్రవేశ పరీక్ష

శృంగవరపుకోట: ఎస్.కోటలోని నాలుగు కేంద్రాల్లో జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షను శనివారం నిర్వహించనున్నట్టు ఎంఈఓ నర్సింగరావు తెలిపారు. పట్టణంలోని నారాయణ కేంబ్రిడ్జ్, రవీంద్ర భారతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలల్లో 864 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు వెల్లడించారు. దీనికోసం 36 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్‌లు పట్టుకుని ఉదయం 10.30 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, 11.15 గంటలకు ప్రశ్నపత్రం ఇస్తారని, మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష రాసేందుకు అనుమతిస్తారని చెప్పారు.

మోక్ష మార్గం ఎప్పుడో?

- మంజూరైన పనులు 176
- ఇప్పటివరకూ పూర్తయినవి 80
- నత్తనడకన రహదారి మరమ్మతులు
- సమీక్షలతోనే అధికారుల కాలయాపన
- ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు



గుంకలాం గ్రామంలో రహదారి త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ మామిడి (ఫైల్)

విజయనగరం రూరల్: సంక్రాంతి పండగ రాకముందే రాష్ట్రంలో రోడ్డు మరమ్మతులు పూర్తవ్వాలని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రహదారులు, భవనాల శాఖ అధికారులకు ఆదేశాలు జారీచేస్తే సంక్రాంతి పూర్తయినప్పటికీ ఇంకా 40శాతం పనులు మాత్రమే జరిగినట్లు చెబుతున్నారు. మిగతా 60శాతం పనులు చేసేందుకు అధికారుల్లో ఇప్పటికీ స్పష్టత లేకపోవడంతో మరమ్మతులు ముందుకుసాగేనా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఎక్కడి పనులు అక్కడే

విజయనగరం డివిజన్ పరిధిలోని మంజూరైన రహదారి మరమ్మతుల పనులు పూర్తిచేసేందుకు కాంట్రాక్టర్లను సంబంధిత అధికారులు పదేపదే టెండర్లు వేసేందుకు పిలిచినా ససేమిరా అంటూ ఇబ్బంది పెడుతున్నట్లు కార్యాలయం వర్గాలు చెబుతున్నాయి. దీనికి గల ప్రధాన కారణం చేసిన పనులకు ఇప్పటికీ సక్రమంగా బిల్లుల చెల్లింపు జరగకపోవడం వల్ల టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఒత్తిడిని తట్టుకోలేక రహదారులు భవనాల శాఖ అధికారులు చొరవ తీసుకుని ఆయా ప్రాంతాల్లోని కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి బిల్లులు త్వరితగతిన అయ్యేలా చూస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిన తరువాతే కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు వచ్చినట్లు సమాచారం. కాంట్రాక్టర్లతో రహదారి పనులు చేయించడం తల ప్రాణం తోకకు వస్తోందేని అధికారులు విసుక్కుంటున్నారు.

పనుల మంజూరు ఇలా..

విజయనగరం డివిజన్ పరిధిలో..		
జీవో నంబర్ 53లో	64 వర్కులు మంజూరు	రూ.11కోట్ల89లక్షలు
జీవో నంబర్ 348లో	47 వర్కులు మంజూరు	రూ.9కోట్ల 13లక్షలు
జీవో నంబర్ 349లో	61 వర్కులు మంజూరు	రూ.3కోట్ల 84లక్షలు
మొత్తం వర్కులు	172	నిధులు రూ. 24కోట్ల 86లక్షలు



దుప్పాడ నుంచి చిల్లపేట వెళ్లే రహదారి పరిస్థితి ఇలా



విజయనగరం నుంచి నెల్లిమర్ల వెళ్లే దారిలో రోడ్డు మరమ్మతులు చేస్తున్న దృశ్యం



రామతీర్థం గ్రామంలో రోడ్డు మరమ్మతులు చేయక ముందు

వేసిన వెంటనే మళ్లీ గుంతలు

డివిజన్ పరిధిలో రహదారి మరమ్మతులు చేసిన 24గంటలు గడవకముందే మళ్లీ గుంతలుగా రహదారులు మారుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో పాటు, సంబంధిత కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల రోడ్లు మళ్లీ గుంతలుగా మారుతున్నాయి. నెల్లిమర్ల మండల కేంద్రం నుంచి రణస్థలం వెళ్లే దారిలో రామతీర్థం గ్రామంలో రహదారి మరమ్మతులు చేసిన కొద్ది రోజుల్లోనే మళ్లీ గుంతలు ఏర్పడ్డాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయాలని కోరుతున్నారు.

పనులు పూర్తిచేయాలి

దుప్పాడ నుంచి చిల్లపేట వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది.కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రోడ్డు మరమ్మతులు చేయిస్తామని నాయకులు హామీలు ఇవ్వడమే మిగిలింది తప్ప..ఇప్పటివరకూ రోడ్డువైపు ఏ ఒక్కరూ కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఏమాత్రం వర్షం పడినా రహదారి గుంతల మధ్య నీరు నిండిపోయి ప్రమాదాలకు గురువుతున్నాం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిసారించి రోడ్డు మరమ్మతులు చేయించాలని కోరుతన్నాం. – ఎస్. బంగారయ్య, దుప్పాడ

80 పనులు మాత్రమే అయ్యాయి

విజయనగరం డివిజన్ పరిధిలో 176 వర్కులు మంజూరుకాగా, వాటి మరమ్మతులకు రూ.23కోట్లు నిధులు వెచ్చిస్తున్నాం. సంక్రాంతికి శతశాతం పూర్తిచేయాల్సి ఉంది. అయితే మధ్యలో వారం రోజుల పాటు తుఫాన్ కారణంగా రహదారి మరమ్మతులు సక్రమంగా సాగలేదు. ఈ నెలాఖరు నాటికి పూర్తిచేస్తాం.
– కాంతిమతి, ఎస్ఈ, రహదారులు, భవనాల శాఖ



రోడ్డు మరమ్మతులు చేసిన కొద్ది రోజులకే మళ్లీ గుంతలు పడిన దృశ్యం

త్వరిత గతిన ఓటరు నమోదు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుదర్శనరావు

నెల్లిమర్ల: బీఎల్‌ఓలు త్వరితగతిన ఓటరు నమోదు పూర్తి చేయాలని తహసీల్దార్ పి.సుదర్శనరావు సూచించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల డీటీ వీవీఆర్ జగన్నాథరావు ఆధ్వర్యంలో బీఎల్‌ఓలతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ త్వరితగతిన ఓటరు నమోదు పూర్తి చేయాలని, ఈ నెల 22 వ తేదీన జరగనున్న సమావేశం నాటికి బీఎల్‌ఓలు రిజిస్టర్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని ప్రతి పోలింగ్‌స్టేషన్‌లో జరిపించాలని సూచించారు. అలాగే ఓటర్ల జాబితా ను పరిశీలించి ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా తయారు చేసి ఎలక్షన్ కమిషన్ ఆదేశాల ప్రకారమే బీఎల్‌ఓలు విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అంతేకాకుండా మండలంలో సీనియర్ ఓటర్లను ఎంపిక చేసి నివేదిక ఇవ్వాలని కోరారు. కాగా ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో సీనియర్ ఓటర్లను ఎంపిక చేసుకుని జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా సన్మానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయం ఏఓ సుదర్శనం, సీనియర్ అసిస్టెంట్ ప్రసన్నకుమార్, ఆపరేటర్‌లు మహేష్, భాస్కర రావు బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

సతివాడ హోమియా వైద్యాధికారిగా సుమలత



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ సుమలత

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ హోమియో ఆస్పత్రి వైద్యాధికారిగా పి సుమలత బాధ్యతలు స్వీకరించారు. గడిచిన 9 ఏళ్ల నుంచి ఆస్పత్రికి హోమియో వైద్యాధికారి లేరు. ఇన్‌చార్జ్‌లతో ఇప్పటివరకు వైద్య సేవలు కొనసాగాయి. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సుమారు 20 గ్రామాల ప్రజలు హోమియో వైద్యానికి దూరమయ్యారు. తాజాగా కడప జిల్లా నుంచి శాశ్వత ప్రాతిపదికన డాక్టర్ సుమలత వైద్యాధికారిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా హోమియో డాక్టర్‌గా నియమితులైనట్లు తెలిపారు. అన్ని వ్యాధులకు సతివాడ హోమియో వైద్యాలయంలో చికిత్సలు అందిస్తామని, మండల ప్రజలు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై గణేష్

నెల్లిమర్ల: మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై బి.గణేష్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయం పరిధిలో జరుగుతున్న సంఘటనల పట్ల మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, బెల్ట్ షాప్ నిర్వహణ, కోడి పందాలు, పేకాట వంటి అంశాలపై దృష్టిసారించి సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రత్యేకించి బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మహిళా పోలీసులపై ఉందని పేర్కొన్నారు. కావున పైన పేర్కొన్న అంశాలపై దష్టి సారించాలని కోరారు.

పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదు

- ఆటోడ్రైవర్ కుమార్ ఆరోపణ



ఫిర్యాదు చూపిస్తున్న ఆటో డ్రైవర్ కుమార్

గంట్యాడ: ఆటో పోయిందని ఫిర్యాదు చేస్తే పోలీసులు సరిగా స్పందించలేదని ఓ ఆటోడ్రైవర్ ఆరోపించాడు. వివరాల్లోకి వెళితే.. గంట్యాడ మండలం పెదవేమలి గ్రామానికి చెందిన ఒకటిపూడి కుమార్ విశాఖపట్నంలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. సంక్రాంతి పండగ నేపథ్యంలో కుటుంబ సభ్యులతో పాటు పెదవేమలి గ్రామానికి వచ్చాడు. ఈక్రమంలో కొతారుబిల్లి జంక్షన్‌లో ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు గురువారం వెళ్లాడు. ఆ రోజు రాత్రి ఏడు గంటల సమయంలో కొతారుబిల్లి జంక్షన్ వద్ద ఆటో నిలిపివేసి అమ్మవారిని దర్శించుకుని తిరిగి 8.15 గంటల సమయానికి వచ్చేసరికి ఆటో కనిపించలేదు. సమీపంలో వెతికినా ఫలితం లేకపోవడంతో అదే రోజు రాత్రి పది గంటల సమయంలో గంట్యాడ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్లగా పోలీసులు మరుచటి రోజు రమ్మన్నారు. శుక్రవారం రెండుసార్లు వెళ్లినా తన నుంచి ఫిర్యాదు తీసుకోలేదని బాధితుడు వాపోయాడు. ఇదే విషయాన్ని ఎస్సై సాయికృష్ణ వద్ద సాక్షి ప్రస్తావించగా.. ఆటోకి సంబంధించిన పత్రాలు తీసుకుని రమ్మన్నామని, వాటిని తీసుకువస్తే ఫిర్యాదు తీసుకుంటామని చెప్పారు.

పింఛన్ల కోసం ఎదురు చూపులు..!

- అర్హత ఉన్నా ఆరునెలలుగా అందని పింఛన్లు
- ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో అసహనం
- దరఖాస్తు చేసుకోవడానికి నేటికీ తెరుచోని వెబ్‌సైట్
- ఆవేదన వ్యక్తం చేస్తున్న వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు



పూసపాటిరేగ సచివాలయం

పూసపాటిరేగ: ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అర్ధ సంవత్సరం దాటుతున్నా కొత్త పింఛన్ల మంజూరుకు నోచుకోలేదు.అర్హత ఉన్నా దరఖాస్తు చేసుకోవడానికి కనీసం వెబ్‌సైట్ ఓపెన్ చేయలేదు. అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు నెలలుగా పింఛన్లు మంజూరు కాక ఆశతో ఎదురు చూస్తున్నారు. భర్త చనిపోయిన మహిళలకు అదే నెలలో స్పౌజ్ కోటాలో తాజాగా అనుమతి ఇచ్చి, ఏడాది కాలంగా భర్త చనిపోయి ఎటువంటి ఆదరువు లేకుండా ఉన్న మహిళలు పింఛన్‌కు నోచుకోకపోవడం తీవ్రమైన అన్యాయమని పలువురు వాపోతున్నారు. వందల సంఖ్యలో వితంతువులు పింఛన్ అందక కనీసం మందుల ఖర్చు అయినా లేక అల్లాడుతున్నారు. గతంలో రాజకీయ పార్టీలుకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వలంటీర్లు దరఖాస్తు చేసిందే తడవుగా పింఛన్ మంజూరయ్యేది. ఇప్పుడు పరిస్థితి చూస్తే సంక్షేమ పథకాల మాట దేముడెరుగు కనీసం సామాజిక పింఛన్లు అయినా మంజూరు చేయకపోవడంపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో సుమారు 2000 మంది అర్హులైన పింఛన్‌దారులు ఉన్నారు. పూసపాటిరేగ, భోగాపురం, నెల్లిమర్ల, డెంకాడ మండలాల్లో ఇప్పటికే మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ వందలాది మంది పింఛన్లకు అర్హులైన వారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పూసపాటిరేగ మండలంలోని కుమిలి గ్రామంలో భర్త కాలం చేసి నెలలు దాటుతున్నా పింఛన్‌కు నోచుకోని కోండ్రు లక్ష్మి, ఉప్పాడ అసిరమ్మ, బుర్లె అప్పయ్యమ్మ, పొట్నూరు రమణమ్మ, గొండేల రాములమ్మ, ఎడ్లపల్లి లక్ష్మిలు ఉన్నారు. పూసపాటిరేగకు చెందిన పిల్ల బుచ్చమ్మ భర్త కాలం చేసి ఏడాది దాటుతున్నా నేటికీ పింఛన్‌కు నోచుకోలేదు. అర్హత ఉన్న వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయాలకు అర్హులు వెళ్తున్నా వెబ్‌సైట్ ఓపెన్ కాలేదని చెప్పి వెనక్కి పంపిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి నిరంతరాయంగా వెబ్‌సైట్ ఓపెన్‌లో ఉండేది. కానీ నేటి పరిస్థితి చూస్తే భిన్నంగా ఉంది.

పింఛన్ల తొలగింపు కుట్ర..!

సార్వత్రిక ఎన్నికల సమయంలో సామాజిక పింఛన్లకు సంబంధించిన వెబ్‌సైట్ నిలిపివేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు వెబ్‌సైట్ ఓపెన్ చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. నెలరోజుల క్రితం పింఛన్ల తనిఖీలో భాగంగా పైలట్ ప్రాజెక్టులో జిల్లాలోని పూసపాటిరేగ మండలం వెల్దూరు సచివాలయాన్ని ఎంపిక చేసి 11 బృందాలుగా అధికారులు పింఛన్లు తనిఖీ చేశారు. కొత్త పింఛన్లు ఎలాగూ మంజూరు చేయలేదు. ఉన్న పాత పింఛన్లను తొలగించే కుట్ర చేస్తున్నారా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు సామాజిక పింఛన్లకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇచ్చి మంజూరు చేయాలని కోరుతున్నారు.

నేడు స్వచ్ఛ దివస్ ర్యాలీ

గజపతినగరం: స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో శనివారం ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.కల్యాణి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. నెలలో ప్రతి మూడో శనివారం ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రం చేసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం పదిన్నర గంటలకు మండల ప్రజాపరిషత్‌కార్యాలయం నుంచి గజపతినగరం మార్కెట్ జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు.

ప్రొటోకాల్ పాటించలేదు..

వేపాడ: మండలంలోని కరకవలస పంచాయతీ శివారు మారిక రహదారి పరిశీలనకు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ శుక్రవారం వచ్చారని.. అయితే ఈ కార్యక్రమానికి తమకు అధికారులు ఆహ్వానించినప్పటికీ, ప్రొటోకాల్ పాటించలేదని ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.అప్పారావు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు ఆరోపించారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో వారు మాట్లాడుతూ.. అధికార కార్యక్రమానికి ఆహ్వానించి పార్టీ కార్యక్రమంలా మార్చి మమ్మలను అవమానించడం బాధాకరమన్నారు.

క్షేత్రస్థాయిలో మాదక ద్రవ్యాల నియంత్రణే 'సంకల్పం'



గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రూరల్ పోలీస్ అధికారులు

- రూరల్ సీఐ బి.లక్ష్మణరావు

విజయనగరం క్రైమ్: మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను యువతకు వివరించి, వారిని మాదక ద్రవ్యాల అలవాటుకు దూరం చేసేందుకు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'సంకల్పరథం'తో ప్రచారం చేపడుతున్నట్లు రూరల్ సీఐ బి.లక్ష్మణరావు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రూరల్ పరిధిలోని ద్వారపూడి, గుంకలాం, కొండకరకాం, జమ్ము, బీసీ కాలనీ, వీటీ అగ్రహారం తదితర గ్రామాలను సందర్శించి ఆయా గ్రామాల్లో సంకల్పరథం వాహనాన్ని నిలిపి, వీడియోలను ప్రదర్శించి ప్రజలకు, యువతకు మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాలను, దుష్ప్రభావాల గురించి, రహదారి భద్రత, మహిళల భద్రత, సైబర్ నేరాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై వి.అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

వేపాడ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ డే కార్యక్రమం నిర్వహణపై అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ దివస్ డే కార్యక్రమం నిర్వహించాలన్నారు. మండల, గ్రామ స్థాయి కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ దాట్ల కీర్తి, మండల నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ రాములమ్మ, ఎంపీడీఓ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.